## కూనీపూర్ శివారులో చిరుత సంచారం

**అప్రమత్తంగా ఉండాలని ఫారెస్టు అధికారుల సూచన**

రుద్రూర్ (వర్ని), అక్టోబర్ 28: వర్ని మండలం కూనీపూర్ గ్రామశివారులో సోమవారం చిరుత సంచారం కలకలం రేపింది. గ్రామ శివారులో ఉన్న ఓ గుడి పరిసర ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నట్లు దాని పాదముద్రల ఆధారంగా అనుమానం వ్యక్తం చేసిన రైతులు.. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఈ మేరకు వారు గ్రామశివారుకు చేరుకొని చిరుత పాదముద్రలను పరిశీలించారు. చిరుత సంచారం వాస్తవమే అని సెక్షన్ ఆఫీసర్ ప్రభాకర్, బీట్ ఆఫీసర్ బాలకృష్ణ నిర్ధారించారు. రైతులు, పశువుల కాపరులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.



చిరుత పాదముద్రలను పరిశీలిస్తున్న అధికారులు



- కానిస్టేబుళ్ల స్పష్టీకరణ
- డిచ్‌పల్లి బెటాలియన్‌లో ర్యాలీ..
- కమాండెంట్‌కు వినతిపత్రం అందజేత

## సస్పెన్షన్ ఎత్తివేసే వరకు పోరాడుతాం..

డిచ్‌పల్లి, అక్టోబర్ 28: తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేసిన పోలీసులను సస్పెండ్ చేయడం సరికాదని, వారిపై సస్పెన్షన్ ఎత్తివేసే వరకూ పోరాడుతామని డిచ్‌పల్లి ఏడో బెటాలియన్ కానిస్టేబుళ్లు స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే పోలీసు విధానం అమలుచేయాలని, సస్పెండ్ చేసిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం పరిపాలనా భవనం వద్దకు చేరుకుని ఇన్‌చార్జి కమాండెంట్ ఎంఐ సురేశ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కానిస్టేబుళ్లు మాట్లాడుతూ.. తమ సమస్యలపై కుటుంబ సభ్యులు ఆందోళన చేస్తే వారి భర్తలను సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజమని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ బెటాలియన్లలో సస్పెండ్‌కు గురైన 39 మంది కానిస్టేబుళ్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**అడవిలో తిరగాల్సిన చిరుతలు** ఆవాస ప్రాంతాల్లోకి వస్తున్నాయి. మేత కోసం వెళ్లే మూగ జీవాలపై తరచూ దాడి చేస్తున్నాయి. పశువులు, మేకలను పొట్టన బెట్టుకుంటూ కలకలం సృష్టిస్తున్నాయి. అలాగే, తండాలు, శివారు ప్రాంతాల్లో కనిపిస్తున్న ఈ వన్య మృగాలు రైతులు, పశువుల కాపరులను బెంబేలెత్తిస్తున్నాయి. రెండు, మూడు నెలులగా చిరుతల సంచారం బాగా పెరిగింది. నిజామాబాద్, ఇందల్వాయి, వర్ని ఫారెస్టు రేంజ్ పరిధిలో వీటి ఆనవాళ్లు తరచూ బయటపడ్డాయి. పశువులపై దాడి చేస్తున్న ఘటనలు తరచూ వెలుగు చూశాయి. దీంతో జీవాలను అటవీ ప్రాంతంలో మేతకు తీసుకెళ్లేందుకు పశువుల కాపరులు భయపడుతున్నారు. మరోవైపు, రైతులు సైతం ఒంటరిగా పంట పొలాలకు వెళ్లేందుకు జంకుతున్నారు.

–వినాయక్‌నగర్, అక్టోబర్ 28




# వామ్మో చిరుత

- తరచూ మూగ జీవాలపై దాడులు
- భయాందోళనలో రైతులు, ప్రజలు
- జిల్లాలో పెరిగిన పులుల సంఖ్య
- గతం కన్నా 50 శాతం వృద్ధి చెందినట్లు గుర్తింపు


## ఆవాస ప్రాంతాల్లోకి వన్య మృగాలు

**నిజామాబాద్** అటవీ శాఖ పరిధిలో చిరుతల సంఖ్య గణనీయంగా పెరిగింది. గతంలో కన్నా కనీసం 50 శాతం పెరిగినట్లు అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. నిజామాబాద్, ఆర్మూర్ డివిజన్ల పరిధిలో గతంలో కన్నా ఉన్న చిరుతల సంఖ్యతో పోలిస్తే సుమారు 50 శాతం పెరిగినట్లు పేర్కొంటున్నారు. నిజామాబాద్ డివిజన్ పరిధిలో నార్త్, సౌత్, ఇందల్వాయి, వర్ని రేంజ్‌లతో పాటు ఆర్మూర్ డివిజన్ పరిధిలో ఆర్మూర్, కమ్మర్‌పల్లి, సిరికొండ రేంజ్‌ల పరిధిలో గతంలో 70 చిరుతలు ఉండగా, ఇప్పుడా సంఖ్య 100కు చేరి ఉంటుందని ఫారెస్టు అధికారులు భావిస్తున్నారు.



### ఐదేండ్లకోసారి గణన..

అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఐదేండ్లకోసారి అటవీ విస్తీర్ణంతో పాటు అడవి జంతువుల గణన చేస్తుంటారు. జూన్ లేదా జూలై మాసాలలో చేపట్టే ఈ గణనలో శాకాహార,మాంసా హార జంతువులను లెక్కిస్తారు. 2020లో జరిగిన గణనలో జిల్లా వ్యాప్తంగా సుమారు 70 చిరుత పులులు ఉన్నట్లు తేలింది. ఈ నాలుగేండ్లలో వాటి సంఖ్య మరో 50 శాతం పెరిగిందని చెబుతున్నారు. వచ్చే జూన్‌లో మరోసారి అడవీ జంతువుల గణన చేపట్టనున్నారు. అయితే, ఈ మధ్య కాలంలో చిరుతలు గ్రామీణ ప్రాంతాలకు రావడం, మూగ జీవాల పై దాడులు చేయడాన్ని వాటి సంఖ్య పెరిగిందనే చెప్పవచ్చు.అయితే ఈ విషయాని ఫారెస్ట్ అధికారి ద్వారా వివరాలు సేకరించడంతో గత నాలుగేండ్ల క్రితం ఉన్న 70 చిరుత పులల సంఖ్య ఇప్పుడు సుమారు 100 కు చేరిందని చెప్పుకు వచ్చారు.అంటే నాలుగేండ్ల క్రితం వరకు ఉన్న చిరుత పులల సంఖ్యను బట్టి చూస్తే యాభై శాతం చిరుతలు వృద్ధి చెందినట్లు గుర్తించారు.



### తరచూ దాడులు..

- వర్ని రేంజ్ అటవీ ప్రాంతంలో జూలై నెలలో రెండు మేకలపై దాడి చేశాయి
- ఇందల్‌వాయి ఫారెస్ట్ రేంజ్ పరిధిలో యానంపల్లి శివారులో దూడపై చిరుత దాడి చేసింది.
- ఆగస్టు 3న నిజామాబాద్ శివారులోని నాగారం ఏరియాలోని డంపింగ్ యార్డ్ సమీపంలో చిరుత కనిపించింది.
- మల్కాపూర్ (ఏ) గ్రామశివారులో చిరుత కనిపించడంతో గ్రామస్తులు పరుగులు పెట్టారు.
- ఆగస్టు 6న మరో లేగ దూడ పై దాడిచేసి చంపి తిన్నది. ఘటనా స్థలంలో లభించిన పాదముద్రల ఆధారంగా అది చిరుతపులి అని అటవీ అధికారులు నిర్ధారించారు.
- ఆగస్టు 15న కూడా ఈ ప్రాంతంలోకి వచ్చిన చిరుత మంద పై దాడి చేసి, ఒక గొర్రెను చంపి తిన్నది.
- సెప్టెంబర్ 13న ఓ రైతు కూలీలతో కలిసి టిప్పర్‌లో వెళ్తుండగా వారికి చిరుత కనిపించింది.

### ఆహారం కోసమే అడవి దాటి..



సహజంగా అన్ని రకాల జంతువులకు వాటికి కావాల్సిన ఆహారం, నీళ్లు అడవి లోపలే లభించడం వలన అవి ఎక్కువ శాతం బయటికి రావు. వాటికి కావాల్సింది దొరకని సమయంలోనే అవి ఆహారం కోసం ఇలా జనావాసాల వైపు వస్తుంటాయి. ఎక్కడైనా చిరుతలు కానీ, ఇతర వన్య మృగాలు కనిపిస్తే అటవీ అధికారులకు సమాచారం ఇచ్చినట్లయితే వారు వచ్చి తగు చర్యలు తీసుకుంటారు.

**- రవి మోహన్ భట్, ఇందల్వాయి రేంజ్ ఆఫీసర్**

## ప్రతిభ చాటిన తక్కడ్‌పల్లి బిడ్డ

**చెస్‌బాక్సింగ్‌లో కాంస్య పతకం**

బిచ్కుంద, అక్టోబర్ 28: కామారెడ్డి జిల్లా బిడ్డ అంతర్జాతీయ వేదికపై మెరిసింది. బిచ్కుంద మండలం పెద్ద తక్కడ్‌పల్లికి చెందిన ప్రతిభ చెస్‌బాక్సింగ్‌లో సత్తా చాటింది. ఈ నెల 23 నుంచి 28 వరకు ఆర్మేనియాలో జరిగిన 6వ అంతర్జాతీయ చెస్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ చాటి కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. పైగా, ఈసారి జరిగిన పోటీల్లో వెయిట్ కేటగిరీ తొలగించడం వల్ల, తన కన్న అధిక బరువు కేటగిరీకి చెందిన ప్రత్యర్థులతోనూ తలపడిన ప్రతిభ ఏమాత్రం వెరువకుండా వరుస విజయాలు సాధించింది. చివరకు కాంస్య పతకాన్ని దక్కించుకుంది. వరుసగా పతకాలు సాధిస్తున్న ప్రతిభను గ్రామస్తులు అభినందిస్తున్నారు.



కాంస్య పతకంతో ప్రతిభ

## బస్వాపూర్ విండో ఇన్‌చార్జి చైర్మన్‌గా మద్దిస్వామి బాధ్యతల స్వీకరణ

భిక్కనూరు,అక్టోబర్ 28: మండలంలోని బస్వాపూర్ సింగిల్ విండో ఇన్‌చార్జి చైర్మన్‌గా మద్దిస్వామి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. గత చైర్మన్ కిష్టాగౌడ్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో అధికార పార్టీ నేతలు 'విండో విభజన' పేరిట కుటిల రాజకీయాలకు పాల్పడ్డారు. చైర్మన్లను పర్సన్ ఇన్‌చార్జీలుగా నియమిస్తూ అడ్డదారిలో ఉత్తర్వులు తీసుకువచ్చారు. దీనిపై విండో పాలకవర్గ సభ్యులు హైకోర్టును ఆశ్రయించారు. విచారించిన న్యాయస్థానం విండో విభజనతోపాటు పర్సన్ ఇన్‌చార్జీల నియామకం చెల్లదని తీర్పునిచ్చింది. హైకోర్టు ఉత్తర్వుల మేరకు బస్వాపూర్ సింగిల్ విండో చైర్మన్‌గా ఉన్న కిష్టాగౌడ్‌ను పదవి నుంచి తొలగిస్తూ డీసీవో రామ్మోహన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కిష్టాగౌడ్‌పై అవిశ్వాసం నెగ్గినట్లు ప్రకటించడంతో పాటు తిరిగి సింగిల్ విండో ఎన్నికలు నిర్వహించే వరకు వైస్‌చైర్మన్‌గా ఉన్న మద్దిస్వామి ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తారని సీఈవో మహేశ్వరి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు మద్దిస్వామి సోమవారం విండో ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించగా.. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. బాణాసంచాలు కాలుస్తూ సంబురాలు చేసుకున్నారు. ఎస్సై సాయికుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, మండలంలోని విండో చైర్మన్లు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విండో ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న మద్దిస్వామి

## నేడు 'బీసీ కమిషన్' ప్రజాభిప్రాయ సేకరణ

**కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు**

కంఠేశ్వర్, అక్టోబర్ 28 : స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల కల్పనపై ప్రభుత్వం నియమించిన బీసీ కమిషన్ నేడు జిల్లాలో బహిరంగ విచారణ చేపట్టనున్నదని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి నిజామాబాద్ నగరంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతారని పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తమ అభిప్రాయాలను కమిషన్‌కు తెలియజేయవచ్చని సూచించారు. నిర్దేశిత నమూనాలో వెరిఫికేషన్ అఫిడవిట్‌తో పాటు ఆరు సెట్లను తెలుగు లేదా ఆంగ్ల భాషలో ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. వారి వాదనలకు మద్దతుగా వారి వద్ద ఉన్న సమాచారం, మెటీరియల్, సాక్ష్యాలను సంబంధిత కేసుల వివరాలను కమిషన్‌కు నివేదించవచ్చని పేర్కొన్నారు.



బోధన్ పట్టణంలో రాస్తారోకో చేస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

**బోధన్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థుల రాస్తారోకో**

శక్కర్‌నగర్, అక్టోబర్ 28: ఫీజు రీయింబర్స్‌మెంట్‌తోపాటు ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం రాస్తారోకో నిర్వహించారు. ఉదయం కళాశాలలకు వచ్చిన విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ కన్వీనర్ శశిధర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో ప్రైవేట్ కళాశాలల్లో చదివే విద్యార్థులు అర్ధంతరంగా చదువులు ఆపే పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. సర్కారు విద్యారంగాన్ని పటిష్టం చేస్తామని చెబుతున్న మాటలకు చేతలకు పొంతన లేదన్నారు. స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని కోరుతూ ప్రైవేట్ కళాశాలలు ఇటీవల మూడురోజులపాటు బంద్ పాటించి నిరసన వ్యక్తంచేసినా, ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ వెంటనే విడుదల చేయాలని లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

## నిజామాబాద్ నగరపాలక సంస్థ కమిషనర్‌గా దిలీప్‌కుమార్

**సీసీఎల్‌ఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా మకరంద్ బదిలీ**



కంఠేశ్వర్, అక్టోబర్ 28 : నిజామాబాద్ నగరపాలక సంస్థకు నూతన కమిషనర్‌గా ఎస్. దిలీప్‌కుమార్ రానున్నారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేస్తున్న మంద మకరంద్ బదిలీ అయ్యారు. 2023 జూలై 18 నుంచి నిజామాబాద్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేస్తున్న మకరంద్ బదిలీపై సీసీఎల్‌ఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా వెళ్లనున్నారు. ప్రస్తుతం మేడ్చల్, మల్కాజిగిరి జడ్పీ సీఈవోగా పనిచేస్తున్న దిలీప్‌కుమార్ నిజామాబాద్ నగరపాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు.

**కామారెడ్డి అడిషనల్ కలెక్టర్‌గా విక్టర్**

కామారెడ్డి, అక్టోబర్ 28 : కామారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) గా వి.విక్టర్ బదిలీపై రానున్నారు. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. హెచ్ఎంఈఏలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న విక్టర్‌ను ఇక్కడికి బదిలీ చేసింది.

## తొర్తిలో వీధికుక్క స్వైర విహారం

**ఆరుగురిపై దాడి.. మోర్తాడ్ సీహెచ్‌సీలో చికిత్స**

మోర్తాడ్, అక్టోబర్ 28: ఏర్గట్ల మండలం తొర్తి గ్రామంలో ఓ వీధి కుక్క ఆదివారం రాత్రి ఆరుగురిపై దాడి చేసి గాయపరిచింది. వివిధ ప్రాంతాల్లో ఉంటున్న వారిపై దాడి చేయడంతో గ్రామంలో కొద్దిసేపు భయానక వాతావరణం నెలకొన్నది. కుక్క దాడిలో పత్రిశోభ, గంగాధర్, భూదేవి, బాపుసింగ్, వైష్ణవి, షేక్ కలీం గాయపడగా..వెంటనే వీరు మోర్తాడ్ సీహెచ్‌సీకి వెళ్లి చికిత్స తీసుకున్నారు. కుక్క గ్రామంలో తిరుగుతూ కనబడిన వారిపై దాడి చేస్తుండడంతో గ్రామస్తులు దానిని గ్రామ శివారులో వదిలేసి వచ్చారు.



సీహెచ్‌సీలో బాధితురాలికి చికిత్స చేస్తున్న సిబ్బంది

సబ్ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఏఐపీకేఎస్ నాయకులు



## ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- రైతాంగం సమస్యలను పరిష్కరించాలి
- ఏఐపీకేఎస్ నాయకుల డిమాండ్
- బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా

బోధన్, అక్టోబర్ 28: ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని ఏఐపీకేఎస్ (అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి గుమ్ముల గంగాధర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధకారంలోకి రాగానే రూ. 2లక్షల లోపు రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించినా, ఇందులో సుమారు 40 శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందని, మిగతా వారు కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. రైతు భరోసా పంట కోతలు పూర్తయినా అందించకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ఇంతవరకూ పూర్తిస్థాయిలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తమ పంటను దళారులకు అమ్ముకుంటున్నారని తెలిపారు. పరోక్షంగా ప్రభుత్వం దళారులను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని లేని పక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వ్యవసాయంపై ఆధారపడి 58 ఏండ్లు పూర్తయిన ప్రతి రైతుకూ నెలకు రూ. 10వేలు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు అందజేశారు. కార్యక్రమంలో అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పుట్టి నడ్పినాగన్న, మండల అధ్యక్షుడు పడాల శంకర్, కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి షేక్ నసీర్, నాయకులు సిద్ద పోశెట్టి, శంకర్, గంగారాం పాల్గొన్నారు.